## క్లుప్తంగా

### గరుడ వాహనంపై దర్శనమిచ్చిన పాండురంగడు



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుడవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర పూజలు నిర్వహించారు. రాత్రికి పాండురంగడు ప్రత్యేక అలంకరణంలో గరుడవాహనంపై భక్తులకు కనువిందు చేశారు. శుక్రవారం గజేంద్రవాహనంతో స్వామివారి వాహన సేవలు ముగియనున్నట్లు ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

### వైభవంగా చెన్నకేశవుడి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయిలో వెలసిన చెన్న కేశవస్వామి ఆలయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా వేదపండితులు దివాకర్ శర్మ, పవనయ్య శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ మద్దిలేటి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

### భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల: భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐఈఆర్టీలు నూరుబాషా, మౌలాబీ పేర్కొన్నారు. దివ్యాంగులను బడిబాట పట్టించేందుకు గురువారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఇప్పటి వరకు పాఠశాలకు రాని వారు, బడి మధ్యలో మానేసిన 18 ఏళ్లలోపు వారి వివరాలను సేకరిస్తున్నామని వారు చెప్పారు. దివ్యాగులకు చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, వారి సంక్షేమం కోసం అమలవుతున్న రాయితీలు, సదుపాయాల గురించి పిల్లల తల్లితండ్రులకు వివరించారు. దివ్యాంగులను భవిత కేంద్రాలకు రప్పించి విద్యాబుద్ధులు నేర్పించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

### బీసీజీ టీకా వేయించుకోవాలి



బీసీజీ టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా టీబీ నివారణ సూపర్‌వైజర్ రామకృష్ణ

బేతంచెర్ల: టీబీ నిర్మూలనకు బీసీజీ టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా టీబీ నివారణ సూపర్‌వైజర్ రామకృష్ణ సూచించారు. గురువారం బేతంచెర్ల పట్టణంతో పాటు గ్రామాల్లోని సచివాలయాల్లో చేపట్టిన బీసీజీ టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వ్యక్తులు, పొగ తాగేవారు, గతంలో టీబీ వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా బీసీజీ టీకాను వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ఇమ్రాన్ ఖాన్, ఏఎన్‌ఎంలు లక్ష్మీదుర్గ, తిప్పమ్మ, రేణుక, లక్ష్మిదేవి, అమల తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల శుభ్రత పాటించాలి



తొట్టిలోని నీటిని పారబోస్తున్న మున్సిపల్ సిబ్బంది

డోన్ : ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని కమీషనర్ డాక్టర్ జయరాం ప్రజలకు సూచించారు. పట్టణ పరిధిలోని నాల్గవ వార్డు కాలనీలలో గురువారం డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాతో కలిసి పర్యటించారు. శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ఇళ్ల ఆరుబయట తొట్లు, కుండీలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వల మూలంగా డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఆరు ఇసుక ట్రాక్టర్ల సీజ్**

కోవెలకుంట్ల: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను గురువారం కోవెలకుంట్ల పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ వరప్రసాద్ సమాచారం మేరకు.. ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా పెన్నా నది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో కోవెలకుంట్ల వైపు తరలిస్తుండగా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

# మట్టి పరీక్ష... సాగుకు రక్ష !

- భూసారం బాగుంటేనే అధిక దిగుబడులు
- పంటల మార్పిడికి ఉపయోగం

బనగానపల్లె: ఖరీఫ్ సీజన్ జూన్‌లో ప్రారంభమవుతున్న నేపథ్యంలో సాగుకు రైతన్న సన్నద్ధం అవుతున్నాడు. ఈ మధ్యకాలంలో కురుసిన వర్షాలు సాగుకు కలిసిరావడంతో దుక్కు పనుల్లో రైతులు బిజీ అయ్యారు. అయితే సాగుకు రక్ష అయిన మట్టి పరీక్షలు చేయించడంలో రైతులు చాలా వరకు నిర్లక్ష్యం వహిస్తున్నారనేది వాస్తవం. భూసారం తెలుసుకోడానికి మట్టి పరీక్షలు చాలా అవసరం. పంటల సాగుకు ప్రతి రైతు మట్టి పరీక్షలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మట్టి పరీక్షల మేరకు సాగు చేపడితే పంటతోపాటు భూమికి రక్షణ ఉంటుందంటున్నారు వ్యవసాయ అధికారులు. పంట కోతలు ముగిసిన నెల రోజులకు మట్టినమూనా సేకరించాలి. భూసార పరీక్షలతో ఏ పంట పండించాలనే విషయం తెలుస్తోంది. ఆ పంటకు ఎరువులు ఎంత వేయాలి అనే అంశాలు రైతులకు అర్థమవుతాయి. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడలు పెరగాలంటే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. వాస్తవానికి 90శాతం రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నవో లేవో



పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

తెలుసుకోకుండానే పంటలు సాగు చేస్తున్నారు. దిగుబడుల కోసం రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ఖర్చులు పెరుగుతున్నాయే తప్పా దిగుబడులు సక్రమంగా రావడంలేదు. అంతేకాకుండా ఎరువులు ఎక్కువగా వాడడం మూలంగా భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలో వ్యవసాయ అధికారుల రికార్డుల ప్రకారం 2.16లక్షల ఎకరాల సాగు భూమి ఉంది.

**జీపీఎస్ విధానంతో మట్టి సేకరణ**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సాగులో అమలు చేస్తూ రైతులకు మెరుగైన దిగుబడులు సాధించేలా వ్యవసాయ అధికారులు ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా చర్యలు చేపడుతున్నారు. భూసార పరీక్షల ఆధారంగా నేలలో ఉన్న పోషకాలను గుర్తించి పంటల సాగు చేపట్టేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. ఈ మేరకు జీపీఎస్ ద్వారా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**సూక్ష్మపోషకాలే కీలకం**

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదును మించి వాడుతున్న రసాయన ఎరువుల వల్లనే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పోటాషియం ఎక్కువగా వాడడంతో మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందకుండా పోతున్నాయి. ఫలితంగా జింక్ లోపం ఏర్పడి మొక్క ఎదుగుదలతగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. సూక్ష్మ పోషకాలతో పాటు నైట్రోజన్ సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బణంలోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమై పోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరగణిస్తారు. చాల చోట్ల భూమిలో కేవలం 0.1 నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది.

**భూసార పరీక్షలు ఎంతో మేలు**



భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులకు అధిక దిగుబడులు లభిస్తాయి. భూసార పరీక్షలు చేసి రైతులకు కార్డులు అందించే కార్యక్రమం ప్రారంభించాం. ఈ సంవత్సరం కూడా రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం. రసాయన ఎరువులు అధికంగా వాడడం మూలంగా భూమిలో సారం తగ్గి పంటదిగుబడి తగ్గిపోతుంది. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి.

– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, బనగానపల్లె

**మట్టి సేకరణలో జాగ్రత్తలు**

పొలంలో ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు మట్టి సేకరించకూడదు. అదేవిధంగా పంటకు నీరుపెట్టిన తర్వాత నీడపడే ప్రదేశాలు, ఎరువు కుప్పలు ఉన్నచోట, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయరాదు. పంటకోత తర్వాత వేసవిలో పంటలులేని సమయాల్లో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించాలి. పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీ మీటర్ల లోతున పారతో గుంత తీసి అందులో పైపొర నుంచి కింది వరకు ఒక్క పక్కగా మట్టిని సేకరించాలి. పొలంలో మొత్తంగా 8 నుంచి 10 చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు బాగాలుగా చేయాలి. అందులో ఎదుటి భాగాలను మాత్రమే తీసుకోవాలి. రాళ్లు, గడ్డి వేళ్లను వేరు చేసి నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తర్వాత ప్లాస్టిక్ బ్యాగ్ లేదా పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి. మట్టి సేకరణకు స్థానిక రైతుభరోసా కేంద్ర సిబ్బంది సహాయం తీసుకుంటే వారు రైతు పొలం వద్దకు మట్టినమూనాలు సేకరించి భూసారపరీక్ష కేంద్రాలకు పంపుతారు.

## మద్యం దుకాణం తనిఖీ



మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ కవిత

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణంలో నంద్యాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్‌ఐ కవిత గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె దుకాణంలో ఉన్న సరుకును పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మద్యం విక్రయాల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఒక వ్యక్తికి మూడు కంటే ఎక్కువ మద్యం బాటిళ్ల విక్రయించరాదన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కౌలు భూముల బహిరంగ వేలం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయానికి సంబంధించి భూములను కౌలుకు ఇచ్చేందుకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ గురువారం తెలిపారు. కౌలు పొందిన రైతులు మూడు సంవత్సరాల పాటు భూమిపై హక్కు కలిగి ఉంటారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వేలం పాటలో తగిన డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

**28న ఉమామహేశ్వరస్వామి భూముల బహిరంగ వేలం**

మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి దేవస్థానికి చెందిన భూములు కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 28న బహిరంగ వేలాం నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు పాతపాడు గ్రామంలోని శ్రీరాముల ఆలయంలో నిర్వహించే ఈ బహిరంగవేలంలో ఆసక్తి ఉన్న వారు తగిన డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ట వార్షిక మహోత్సవం

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీతత్వమసి అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట 30వ వసంతోత్సవం పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం వినాయక సుబ్రహ్మణ్యం స్వామివార్లు, మాళిక పురత్తమ్మవారు, నవగ్రహాలు, నాగమయ్యలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి అష్టాభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

### అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య

డోన్ టౌన్ : పట్టణ శివార్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపాన అటవీశాఖ భూ పరిధిలో భీమలింగడు(40) అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాని పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామానికి చెందిన జయరాముడు కుమారుడు భీమలింగడు దినసరి కూలి పనులు చేసుకుంటూ భార్య పిల్లలను పోషించేవాడు. ఈ నెల 21న అప్పుల బాధలపై కుటుంబ సభ్యులతో గోడవపడి డోన్‌కు పనుల కోసం వచ్చాడు. మనస్థాపానికి గురై విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం చనిపోవడంతో దుర్వాసన వస్తుండగా గురువారం అటుగా వెళ్తున్న వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు మృత దేహాన్ని పరిశీలించి కుటంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఎన్నికల విజయోత్సవాలు నిషేధం

సంజామల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న నిర్వహిస్తున్న నేపథ్యంలో విజయోత్సవాలు నిషేధించామని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామంలో గురువారం ఎస్‌ఐ రమేష్ రెడ్డి, కోవెలకుంట్ల సర్కిల్ సీఐ జయచంద్రతో కలసి డీఎస్పీ కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వచ్చినా ర్యాలీలు, సంబరాలు జరుపుకోకూడదని సూచించారు. అదేవిధంగా ఇతరులను రెచ్చగొట్టేలా వ్యవహరించినా, ప్రోతహించినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా డీఎస్పీ హెచ్చరించారు.



ఆల్వకొండలో పర్యటిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

## గొంతువాపు నివారణ టీకాలు వేయించండి



పేరుసోములలో పశువుకు టీకా వేయిస్తున్న ఏడీ మోహన్‌రావు

సంజామల: పాడిరైతులు పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేయించాలని ఏడీ మోహన్ రావు సూచించారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని పేరుసోములలో పశులకు టీకాలు వేశారు. ఏడీ మాట్లాడుతూ సంజామల, కొలిమిగుండ్ల మండల పరిధిలోని రైతులు పశువులకు గొంతు వాపు, జబ్బువాపు వ్యాధి రాకుండా రోగనిరోధక టీకాలు వేయించాలని సూచించారు. కురుస్తున్న తొలకరి వర్షాలకు కొత్తగా గడ్డి మెలకలు వస్తున్నాయని, ఈ మెలకలు తినడం మూలంగా గొంతువాపు వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధి వచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే పశువులు మృత్యువాత పడేఅవకాశం ఉందని, నివారణకు ముందుగానే టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శివానంద, సిబ్బంది పాల్గొన్నారు.

### 27న అవుకులో జాబ్ మేళా

అవుకు: మండల కేంద్రం అవుకులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల27వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు గురువారం తెలిపారు. కడపలోని షిర్డీసాయి ఎలక్ట్రికల్స్, కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌లో ఉన్న హోండా కంపెనీలో, హైదరాబాద్ తుక్కుగూడాలోని ప్రీమియర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, వేరియెంట్ అప్లియన్సెస్ అండ్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భగవతి ప్రొడక్ట్ లిమిటెడ్, రెన్యుజస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. 18 సంవత్సరాలు పూర్తయి ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. అలాగే ఎస్ఎస్‌సీ/ఇంటర్ ఉత్తీర్ణులై కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన మహిళా అభ్యర్థులకు కోలార్‌లోని సెల్‌ఫోన్ అసెంబ్లీ యూనిట్ లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నెలకు రూ.12వేల నుంచి రూ.17వేల వరకు జీతం ఉంటుందని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిప్రిన్సిపాల్ సూచించారు.

### 27న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురష్కరించుని ఈ నెల 27న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పాలపండ్ల విభాగంలో నిర్వహించే ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో విజేత వృషభరాజముల యజమానులకు వరుసగా రూ. 50వేలు, రూ. 40వేలు, రూ. 30వేలు, రూ. 20వేలు, రూ. 10 వేలు చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. 9440864989, 9966608169 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : డోన్-బేతంచెర్ల జాతీయ రహదారి పనులు, చిన్నమల్కాపురం 33కేవీ షిఫ్టింగ్ నేపథ్యంలో మల్కాపురం, రంగాపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కరెంటు ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. అదేవిధంగా డోన్ ఇండస్ట్రీయల్ సబ్ స్టేషన్‌లో 11కేవీ కన్నపకుంట ఫీడర్ లైన్ షిఫ్టింగ్ నేపథ్యంలో కరెంటు ఉండదన్నారు. కన్నపకుంట, ధర్మారం, కమలాపురం, ఎర్రగుంట్ల గ్రామాలతో పాటు రంగాపురం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు వ్యవసాయానికి త్రీ ఫేస్ కరెంటు ఉదయం 5 నుంచి 12 గంటల వరకు సరఫరా చేస్తామని చెప్పారు.

### షిర్డీ సాయిబాబాకు పౌర్ణమి పూజలు

బేతంచెర్ల: పట్టణ సమీపాన కర్నూలు రహదారిలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు వైశాఖ మాస పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబాకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

### బీసీ గురుకుల పాఠశాలకు గ్రామీణ విద్యార్థులు ఎంపిక

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు బీసీ గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి బేతంచెర్ల బీసీ గురుకుల పాఠశాలకు సుదర్శన్, మద్దిలేటి స్వామి, పవన్‌రాజు, డోన్ బీసీ గురుకుల బాలికల పాఠశాలకు వర్షిత, బనగానపల్లె బీసీ గురుకుల పాఠశాలకు మధుచరణ్ ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో గాయాలు

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోట గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణా రాష్ట్రం, గద్వాల పట్టణానికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. ప్యాపిలి వైపునుంచి కారులో గద్వాలకు వెళ్తుండగా ముందుపోతున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు వీరిని డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం కర్నూలుకు తరలించారు.

### 21 మంది టీడీపీ నాయకుల అరెస్ట్

కొలిమిగుండ్ల: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మే13న పెట్నికోట పోలింగ్ స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేసిన ఘటనలో 21 మంది టీడీపీ నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. టీడీపీ నాయకుల దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మద్దిలేటి, వెంకట్రాముడు గాయపడ్డారు. ఘటన జరిగిన రోజు బాధితుల ఫిర్యాదు మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈకేసుపై డీఎస్పీ పూర్తి స్థాయిలో విచారించారు. గొడవకు కారణమైన గొంగటి హరీశ్వర్‌రెడ్డి, కొప్పుల శివారెడ్డితో పాటు మొత్తం 21 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### అడవి దుప్పి మృతి

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె, రామాపురం గ్రామాల సమీపాన ఓ గనిలో గురువారం అడవి దుప్పి మృతి చెందింది. గని కార్మికులు గుర్తించి పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సురేంద్ర పరిశీలించి దాదాపు 100 అడుగుల ఎత్తులో నుండి గనిలోకి పడటంతో చుక్కల దుప్పి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అయితే కొంతమంది అడవి దుప్పుల కోసం వలలు వేస్తూంటారని, తప్పించుకోబోయి గనిలో పడి మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బనగానపల్లె రూరల్ : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గురువారం ఉదయం మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలో ఫ్యాక్షన్ గ్రామమైన రామక్రిష్ణాపురంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన అనంతరం ప్రజలతో సీఐ సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ ఐకమత్యంగా మెలగాలని, గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏపీ పోలీసు 30 యాక్ట్ అమలులో ఉందని, కౌటింగ్ తర్వాత విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచాలు పేల్చే రాదన్నారు. ఇతరులను రేచ్చగొట్టేలా ప్రవర్తించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నందివర్గం ఎస్‌ఐ తిరుపాల్, అవుకు ఎస్‌ఐ కిరణ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4 జరగనున్న నేపథ్యంలో మండలంలోని రేవనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కలుగొట్లలో గురువారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గంటా సుబ్బారావు

కోవెలకుంట్ల సీఐ జయచంద్ర, రేవనూరు, కోవెలకుంట్ల ఎస్‌ఐలు రాంమోహన్‌రెడ్డి, వరప్రసాద్ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ కార్యక్రమం చేపట్టారు. అనుమానితులు, రౌడీషీటర్లు, గతంలో వివిధ కేసులు నమోదైన వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 11 ద్విచక్రవాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభలో సీఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సెక్షన్ 144 అమల్లో ఉన్నందున ర్యాలీలు, టపాసులు కాల్చడం వంటి కార్యకలాపాలు చేపట్టవద్దని పేర్కొన్నారు.

### వైభవంగా మద్దిలేటయ్య కల్యాణం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో వైశాఖ మాస పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గుత్తి పట్టణానికి చెందిన రాజు కుటుంబ సభ్యుల సహకారంతో లోక కల్యాణార్థం వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం రమణీయంగా జరిగింది.



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

### శేషవాహనంపై దర్శనమిచ్చిన చెన్నకేశవుడు

అవుకు: మండల కేంద్రం అవుకులో తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామివార్లకు శేషవాహన సేవ ఘనంగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివార్లను కోటవీధి నుంచి తేరువీధి, రాజా వీధి, మండపం వీధుల మీదుగా ఊరేగించారు. శుక్రవారం గరుడ వాహనంపై స్వామివారు దర్శనమిస్తారని రైతుసంఘం పెద్దలు తెలిపారు.



స్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

## రోబోటిక్ టెక్నాలజీతో భారతి సిమెంట్

బనగానపల్లె రూరల్ : భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందని ఆ ఫ్యాక్టరీ టెక్నికల్ ఇంజినీర్ ఎం పెంచలయ్య అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని విజయదుర్గ ట్రేడర్స్‌లో తాపీ మేస్త్రీలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెంచలయ్య భారతి సిమెంట్ నాణ్యతాప్రమాణాలను వివరించారు. భారతి సిమెంట్‌తో అత్యుతమ కట్టడాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయాల ఉచిత బీమా పత్రాలను భారతి సిమెంట్ పరిశ్రమ ఉద్యోగులు అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, సేల్స్ ఆఫీసర్ శివారెడ్డి, డీలర్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

### నేటి నుంచి ‘పది’ సప్లిమెంటరీ పరీక్షలు

కొలిమిగుండ్ల: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పరీక్షలకు సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంఈఓలు రాజయ్య, అబ్దుల్‌కలాం తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 225 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు.

**ఇంటర్ పరీక్షలు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఇంటర్ ఫస్టియర్, మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు ప్రారంభం జరుగనున్నాయి. విద్యార్థులు పరీక్షకు అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

బనగానపల్లె రూరల్ : మండలంలో శుక్రవారం నుంచి ఇంటర్,పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంబంధిత అధికారులు గురువారం తెలిపారు. పదవ తరగతికి శుక్రవారం మొత్తం 254 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 127, జెడ్పీబాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 127 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు తెలుగు పరీక్షకు ఫస్ట ఇయర్ 51 మంది, సెంకడ్ ఇయర్ 19 మంది విద్యార్థులు హాజరవు తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రినిపాల్ సలెహా బేగం తెలిపారు.

ప్యాపిలి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి ప్రాంభం కానున్న పదోతరగతి సప్లిమెంటరి పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ వెంకటేష్ నాయక్ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గత మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరి పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని సెంట్‌ఆన్స్ స్కూలు కేంద్రంగా మండలవ్యాప్తంగా ఉన్న 10వ తరగతి ఫెయిల్ విద్యార్థులకు ఈనెల 24 నుంచి 31 వరకు సప్లి మెంటరీ పరీక్షలు కొనసాగుతాయని పరీక్షల చీఫ్ సూపరింటెంట్ చంద్ర శేఖర్ గురువారం తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు సాగుతాయని తెలిపారు.

**ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు**

పట్టణంలోని రీడ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు 24 నుంచి 30 వరకు జరుగుతాయని పరీక్షల చీఫ్ సూపరింటెంట్ తిరుపతయ్య, అడిషనల్ చీఫ్ సూపరింటెంట్ రాజేష్ తెలిపారు. ప్రథమ సంవత్సరం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు సాగుతాయని తెలిపారు.